

# తోడు దొరకని యవ్వనం

శ్రీసుభా

"తలుపు తెరవ్వేతల్లీ" లలితమ్మ తలుపు బాదుతోంది.

"అమ్మా, సుభద్రా, నేనమ్మా నాన్నని, తలుపుతెరు" జోగారావు ప్రాధేయపడుతున్నాడు.

"నేను అన్నయ్యని, నిన్నేమి అనను. తలుపు తెరు''

'అఘాయిత్యంచేయొద్దు. సుభద్రా, ఒట్టు నిన్నేమీ అనను, బాధపెట్టనిక. మీ అన్నయ్య మీద ప్రమాణంచేసి చెబుతున్నాను."

"ఆంటీ ఆంటీ" పనిపిల్లలు యేడుస్తున్నారు.

"చూస్తూ వూరుకుంటారేమిటండీ. తలుపులు బద్దలుకొట్టండి. ఆలస్యం అయితే పిల్ల మనకి దక్కదు."

"గట్టిగా అరవకే అమ్మా. నలుగురూ వింటారు" కృష్ణమూర్తి ప్రాధేయపడుతున్నాడు.

"నువ్వూ, మీ ఆవిడా అన్నమాటలకే అది విసిగిపోయిందిరా" ముక్తకంఠాలు ప్రాధేయపడుతున్నాయి. భరోసా యిస్తున్నాయి. అంతా బీభత్సరసప్రధానంగావుంది. కానీ లోపలినుంచి, యే ప్రశ్నకీ, యే వేడికోలుకీ సమాధానం రాలేదు. వచ్చేదిమాత్రం లోపలినుంచి గుప్పున కిరసనాయిలు వాసన.

"తలుపు బ్రద్దలు కొట్టాలి నాన్నా, లాభంలేదు."

"ఒరే త్వరగావెళ్ళి రోకలి తీసుకురా" యింతలో లోపలినుంచి దీనంగా

నిరాశగా సుభద్ర అన్నమాటలు, వేసిన తలుపులు దాటుకుని వచ్చాయి.

"నేను చచ్చిపోతాను, నాకు బ్రతకాలనిలేదు. వద్దు నాన్నా నాగురించి మీరే ప్రయత్నంచేయొద్దు."

"అలా అనొద్దు సుభద్రా, ఒక్కసారి తలుపుతెరు. నాన్నగారు వీధిలోకి వెళ్ళి మొహం చూపించలేరే...మేం బ్రతకలేమే." లోపలినుంచి జవాబు రాలేదు. అందరి గుండెలూ వేగంగా కొట్టుకుంటున్నాయి. కళ్ళు భయాలకి కానుకలయ్యాయి. ఆలోచనల్ని ఆందోళన కబళిస్తోంది.

*　　*　　*

సుభద్ర అప్పటికి రెండురోజులుగా, పాతికేళ్ళ తన జీవితాన్నీ, జీవితంలో రుచిచూసిన విషాదాన్నీ గుర్తుచేసుకుంటూ వచ్చింది. కిరసనాయిలు పోసుకుని చచ్చిపోవాలని తను తీసుకున్న నిర్ణయంలో అనౌచిత్యం యేమీ కనపడలేదు. పదహారో సంవత్సరం ప్రవేశిస్తూ, తన బ్రతుకులో అంతవరకూవున్న తీపిని హరించి, బదులుగా బళ్ళకొద్దీ చేదుని నింపుతూ రావడం గుర్తుకొచ్చింది.

దేనికోసం బ్రతకాలి-అనే నిరాశావాదం మిగలకుండా దేవుడు ప్రాణికోటికి యేవేవో ఆశలు కల్పించి ముందుకు నడిచేటట్టు చేస్తాట. కన్నవాళ్ళూ, తోటివాళ్ళూ మరికొంత చొరవతీసుకుని ఆ ఆశలకి జలతారులు పులుముతూ భవిష్యత్ అంటే అత్యాశ పుట్టిస్తూవుంటారు. దాంతో జీవితం బీరపాదుగా మారి వూహల పిందెలువేస్తూ కోర్కెలు పందిరి నిండుగా పరుచుకుంటుంది.

అయితే మరి కొందరికి బ్రతుకు శాపంగా, నిరాశావరంగా మిగులుతుంది. దేవుడి మాటేమోగాని, చుట్టూతా మనుషులు కనీసపు కోర్కెలు తీర్చలేని రాళ్ళలా మారతారు. పరిస్థితులుకూడా కోడెత్రాచులా, పగపట్టడం, కాటు లేయడం చేస్తాయి.

జోగారావు మరో ఐదేళ్ళలో రిటైరవుతాడు వుద్యోగిగా. సంసారిగా ఆయనకి ముప్ఫయేళ్ళ సర్వీసువుంది. అందుకు నిదర్శనంగా ఐదుగురు పిల్లలున్నారు. ఆయన కృంగిపోవడాని కన్నట్టుగా అందులో నలుగురు ఆడపిల్లలు; ఒకడు మొగ మహరాజు. ఆయన అసమర్ధతకి కొండగుర్తు అన్నట్టుగా ఆడపిల్లలు యెదిగి పెళ్ళి కాని పిల్లలుగా చలామణీ అవుతున్నారు. ఆయనకి అప్పులున్నాయి, అవస్తలున్నాయి.

ఒక మాటలో చెప్పాలంటే ఆయన జీవితం అమావాస్యనాటి ఆకాశం. రెండేళ్ళక్రితం ఆ ఆకాశంలో ఒక మెరుపు మెరిసింది. అది, కొడుకు కృష్ణమూర్తి విద్యార్థిదశ అనే అవస్థని అధిగమించి గుమాస్తాగా మారడం. వేణ్ణీళ్ళకి చన్నీళ్ళుతోడు అనుకున్నారు

జోగారావూ, లలితమ్మా కొద్దిరోజులు. కానీ మరి కొన్నిరోజులకి అన్నీ చన్నీళ్ళే ననీ, మెరిసిన మెరుపు కళ్ళుతిప్పుతుంది తప్పమార్గాన్ని సుగమం చేయలేదనే నగ్న సత్యం తెలిసి కోర్టులో ముద్దాయిల్లా తలలొంచుకున్నారు.

కృష్ణమూర్తి తను తక్కువ బరువు మోస్తోన్నట్టు ఒప్పుకోడు. అలా ఒప్పు కోవడం ముందుకు తనకి తలవంపు లంటుంది అతని కొత్త పెళ్ళాం జానకి. యిక లలితమ్మ-యింటి యజమాని తలమీద గుదిబండగా మారిన బాధ్య తల బరువుని దింపమని గట్టిగా అనలేక లోలోపలే మధనపడుతుంది. లోలోపల పుట్టిన మధనపాటు, కోపం వేషం వేసు కుని బయటపడుతుంది. నిరాశ్రయంగా పెరుగుతున్న సంతానాన్ని వాటికి బలి చేస్తోంది.

యింట్లో కోల్డ్‌వార్ మనుషుల మధ్య చీలికలుతెచ్చి, ఆ తరువాత వర్గాలుగా మార్చింది.

సుభద్ర తను యెటూ చెందని దాన్నని పదేళ్ళనాడు తెలుసుకుంది. భార్యని వెనకేసుకొచ్చే అన్న; కొడు కుని కాదనలేని తల్లి తనమీదే విసు క్కోడం ఆ అమ్మాయికి కొత్తగా వుండేది.

"చూశారా నాన్నా, నేను సరళతో సినిమాకి వెళ్ళడం తప్పట."

"అన్నయ్య తిడుతున్నాడే, వయ సొచ్చిన తర్వాత ఒదుగుళ్ళు కట్టిపెట్టాలి. నిన్న వాడి స్నేహితుడు సినిమాహాలు దగ్గర నిన్ను చూశాట్ట."

"నే సినిమాకి వెడితే వాడికి అవ మానం దేనికో" అంది కొంచెం చిరాగ్గా సుభద్ర.

"నీకు చెప్పలేనే, నేను."

తల్లినుంచి సమాధానం దొరకని సుభద్రకి వదినగారినుంచి జవాబు దొరికింది.

"పెళ్ళికి యెదిగిన తర్వాత యింట్లో పడుండాలి. రోడ్లు పట్టుకుని తిరిగితే పరువు వీధిని పడుతుంది."

"పెళ్ళి అయిన తర్వాత తిరిగితే మర్యాదా?" సుభద్ర సవాతగా అంది.

జానకి కోపంగా సుభద్రని చూసి తమగదిలోకి సత్యభామగా మారి వెళ్ళి పోయింది. కానీ మరునాడు కృష్ణమూర్తి సుభద్ర సవాల్‌కి జవాబు చెప్పాడు.

"సుభద్రా, నీకు తెలియదేమో. నిన్ను చూసినవాళ్ళు కృష్ణమూర్తి చెల్లెలంటారు గానీ, జోగారావుగారి కూతురనరు. నువ్వు తిరుగుతే, రేపొద్దున్న మా పిల్లలకీ అవే అలవాట్లు అవుతాయి"

సుభద్ర తారామండలానికి లేచింది. "యిది అన్యాయం. నాకు చదువు చెప్పించండి వుద్యోగం చేసుకుని నా పొట్ట నేను పోషించుకుంటాను. అంతేగానీ, యిలా బోనులోపడి వుండమంటే నా

తరంకాదు."

"బుద్ధిలేకపోతేసరి" అన్నాడు.

"నాకొక్కదానికే కాదు" సుభద్ర వెంటనే అక్కడినుంచి వెళ్ళింది. ఆ వెళ్ళడం సరాసరి తండ్రి దగ్గరికి వెళ్ళింది. తండ్రి అయినా న్యాయం చెబుతాడనుకుంది.

"వాడు సంపాదించి పెట్టలేక అలా విసుక్కుంటున్నాడు. నీ మీద వాడికి కోపం అంటే తప్పు. అయినా పెద్ద వాళ్ళు అవుతూంటే బాధ్యతలు తెలిసి రావాలి. ఒకళ్ళచేత చెప్పించుకో కూడదు" జోగారావు అన్నాడు.

యీవిధంగా పదహారోయేట మొదటి సారి సుభద్ర మనస్సుకి మొదటి దెబ్బ తగిలింది చిన్న బీటవేసింది కూడా.

*　　*　　*

చుట్టూ ప్రపంచాన్ని చూస్తూంటే సుభద్రకి అందులో యెన్నో అందాలు, ఆనందాలు వున్నట్టుతెలిసింది. కొందరు స్నేహితులు అత్యంత అద్భుతంగా బ్రతికేయడం చూసింది. మరికొందరు, వింతగా తలమానికంగా యెదిగిపోవడం చూసింది.

కొన్నిరోజులు వాళ్ళకీ తనకీ మధ్య వున్న తేడాకి కారణం దేవుడు అనుకుంది సుభద్ర. కానీ స్నేహితుల జీవితాల్ని పరిశీలించి చూసిన తరువాత చదివిన పుస్తకాల్లో—మనుష్యులకి వింతగా పరిస్థితులు అనుకూలించడం, మంచి వాళ్ళు యెదురయి వుపకారాలుచేయడం కన్పించింది. వాటి ఆలంబనగా తనకి తెలియకుండానే చిన్న చిన్న పిచిక గూళ్ళు కట్టుకుంది. కానీ ఆపిచికగూళ్ళని వీధిలో వాళ్ళకన్నా ముందే యింట్లో వాళ్ళే కూల్చే ప్రయత్నాలు చేసేవారు.

"కొంత మందికి డబ్బులేకపోయినా అందమైనా వుంటుంది. అదీలేదు దీనికి, దీనిపెళ్ళి మీ నాన్నవల్ల కాదురా. పోరి పోరి నా నోరు వడిపోతోంది. నువ్వైనా చూడరా, మీ ఆఫీసులో వో అబ్బాయిని."

"చూసి లాభం యేమిటమ్మా; కనీసం నాలుగైదు వేలైనా కావాలి."

"అంతడబ్బే? యెక్కడినుంచి తెచ్చేది?"

"నాన్నతో మాట్లాడు, మళ్ళీ వోసారి."

"నీకు తెలియకుండా ఆయన దాచిందేంవుంది." లలితమ్మ బ్రతిమలాడుతూ అంది, తిరిగి "పోనీ నువ్వే యెక్కడయినా చూడరా."

"నావల్ల యెలా అవుతుందమ్మా."


"అయితే మరి..." జావకారిపోతూ అంది, లలితమ్మ.

"దానికర్మ యెలావుందో అలా అవుతుంది" కృష్ణమూర్తి ఫిలాసఫీ మొదలు పెట్టాడు.

అప్పటికి సుభద్రకి యిరవైయేళ్ళు వచ్చాయి. శరీరం తరుచు కొత్త కోరి



యువ




కలతో. సరికొత్త వూహలతో కిందా మీదా పడుతోంది. తల్లి, అన్నగారూ మాటలు విన్నతర్వాత అన్నం తినబుద్ధి వేయలేదు. మెదడంతా నిరాశామేఘాలు ముసురుకున్నట్టుగా అయిపోయింది. రాత్రంతా పడుకుని ఆలోచించింది. మొదట ఆవేశం వచ్చింది. ఆ ఆవేశం పిచ్చికోపం అయింది. పిచ్చికోపం వుడుకుమోత్తనంగామారి కన్నీళ్ళు తెప్పించి యేడుపులోకి దింపింది... యేడ్చి, యేడ్చి వోదార్చుకుంది తనకి తనే.

వంటవొండడం, కుర్రాళ్ళకి అన్నాలు తినిపించడం, తల్లిచేతో, వదినగారిచేతో మాటలుపడ్డం, అందుకు మనసు వ్యతిరేకిస్తే ఘర్షణపడ్డం, అంతే...

సుభద్రకి జీవితం, సామాన్య మానవుడు వ్రాసుకున్న స్వీయచరిత్రగా అన్పించింది.

* * *

"పెళ్ళికొడుకు కావాలంటే డబ్బుండాలి. డబ్బులేకపోతే పెళ్ళికొడుకు దొరకడం బహుదుర్లభం." సుభద్ర స్నేహితురాలు సరళ అంది ఆ రోజు.

"నిజమా" అన్నట్టు చూసింది సుభద్ర.

"నిజం సుభద్రా స్నేహంచేయడానికి. పిక్నిక్‌లకితోడుగా రావడానికీ; అదీ పిలవకుండా రావడానికి; వేలాది కుర్రకారు ముందుకువస్తారు. ప్రేమించడానికీ, కామించడానికీ అవకాశం యివ్వు, వురకలు వేసుకుంటూ ప్రత్యక్ష

మవుతారు. పెళ్ళిచేసుకుంటావా అని అడిగావో, ఒక్కడూ తుపాకీదెబ్బకి దొరకడు. వెంటనే మా అమ్మనీ, నాన్ననీ అడగాలి అమ్మాయీ అంటూ తోకముడుస్తారు."

సుభద్ర తలొంచుకుంది.

"బాధపడుతున్నావా సుభద్రా?"

"లేదే" అనేసింది

"సుభద్రా, పాతికేళ్ళవయసు పెద్దది కాదు. అంటే నా వుద్దేశం చదువుకునే వాళ్ళకీ, వుద్యోగాలు చేసుకునేవాళ్ళకీ."

"అదేనే నా బాధ...యింట్లో గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోవాలంటే."

"మీ వాళ్ళని గట్టిగా అడుగు. చదువు చెప్పించమని."

"లాభంలేదే."

"పోనీ పెళ్ళిచేసెయ్యచ్చుగా'' సరళ స్వగతంగా అంది.

సుభద్ర మాట్లాడలేదు. గడ్డిపరకల్ని వీకి పరాకుగాచూస్తే భయంవేసింది— హఠాత్తుగా ఆ పరకల జీవితం వో కొలిక్కివచ్చేయడంచూస్తే!!

"మరి నీ నిర్ణయం యేమిటిటి?" సరళ అడిగింది.

క్లాసులో టీచర్ వేసినప్రశ్నకి జవాబివ్వలేని విద్యార్థిలా చూసింది సుభద్ర.

అటుగావచ్చి సుభద్రని వంటరిగా చూసిన రామారావు; అవకాశంకోసం కాపువేసుకునివున్న సరళ అన్న రామారావు; అదే అదననుకుని సుభద్రని పలకరించాడు.

మాచెల్లాయిగురించి రెండేళ్ళబట్టీ మా యింటికి వస్తున్నావు. నన్ను గుర్తుపట్ట లేదా సుభద్రా" అన్నాడు.

సుభద్రచూసింది. వుంగరాలజుట్టు, ఖరీదయినబట్టలు, గుండెను పిండగల, మాటకారితం. ఖారీమనిషి.

"నువ్వు చాలా మారిపోయావు. అంటే దిగులుగా కన్పిస్తున్నావు."

"అబ్బె...లేదే..."

తన జీవితానికి, తన మనుగడకి చిల్లిగవ్వ విలువ యివ్వని అన్నగార్ని చూసి కోపంతో వుడుకెత్తిపోయిన సుభద్రకి, మంచి చెడలు చెబుతూ వేధించే తల్లినిచూసి మండుకొచ్చిన సుభద్రకి, పదే పదే హేళనచేసి పురుగులా చూస్తూ రెచ్చగొట్టే వదిన గారి మాటలతో జ్వలించిన సుభద్రకి-రామారావు చక్కని చలివేంద్రంలా కన్పించాడు. దాహంతో శోషకొట్టిన మనిషికి మర్రి చెట్టు నీడలా, వూటబావి నీటిలా, కన్పించాడు. మనుషుల్లో రాక్షసుల్ని మాత్రమే చూసిన సుభద్రకి అతను దేవుని అవతారంలా తోచాడు.

"నిన్ను నేను పెళ్ళి చేసుకుంటాను. నీ బ్రతుక్కి, నీ ఆశలకీ పరిష్కారం ఒకటే—మనపెళ్ళి" అన్నాడు రామారావు. సుభద్రని తన ఆకలికి, తన కోరికలకి నిమ్మది నిమ్మదిగా బానిసగా

మార్చుకోగల్గాడు, మలుచుకోగల్గాడు, రామారావు.

* * *

"యిది చెడింది నాన్నా. నీ కడుపున చెడ పుట్టింది." కృష్ణమూర్తి తారా జువ్వలా లేచాడు.

"పెద్దవాళ్ళు అదుపాజ్ఞల్లో పెట్టుకోక పోతే యింతే". జానకి అంటోంది.

"నీ కిదేంబుద్ధే...వాడెవడో, వాడి పేరూ, కులం యేమన్నా తెలుసా. మమ్మల్నీ బ్రతుకు కూడా బ్రతకనివ్వ కుండా, శ్రీరామచంద్రా..."

తల్లీ, అన్నగారూ, వదినగారూ మాటల యీటెలతో తూట్లు చేస్తూంటే సుభద్రకి కోపం వచ్చింది. తనూ నోరు చేసుకుని వాళ్ళ నోళ్ళు మూయించాలను కుంది. తన తప్పునీ, తన ప్రవర్తనలో లోపాన్ని మాత్రమే యెత్తి చూపిస్తూంటే భరించలేకపోయింది. తనని అర్థంచేసు కుని, తన వుద్దేశాన్ని సానుభూతితో గుర్తించేది తండ్రి వొక్కడే అనుకుంది.

అప్పుడు జోగారావు వాకిట్లో చీకట్లో కూర్చున్నాడు. మనిషిలా కాకుండా మనిషి నీడలా వున్నాడు.

"నాన్నా" అంది సుభద్ర.

''యేంపని చేశావు సుభద్రా."

"లేదు నాన్నా,అతను మంచివాడు."

జోగారావు వేలవంగా నవ్వాడు. భోరుమని యేడ్చే మనిషి, పట్టుతప్పి నవ్వినట్టుగా వుంది, ఆ నవ్వు.

"నేను చేతకానివాణ్ణి, యేమీ మిగల్చ లేకపోయాను. నీ పెళ్ళి చేసే స్తోమత కూడా లేదు. అందుకని యిలా నా మీద కక్ష తీర్చుకోవడం మంచిదా సుభద్రా"?

"నాన్నా" అనేసింది సుభద్ర నీరు కారిపోతూ.

తండ్రి తన గురించి యెప్పుడూ మంచిగానే ఆలోచిస్తాడనీ చెడుగా వూహించడని సుభద్ర నమ్మకం. మంచి చెడులు బేరీజు వేసే మధ్య వర్తిగా కాకుండా తనకి అండగా నిలబడతాడను కుంది.

''కట్నాలు యివ్వలేను. మంచి సంబంధం తేలేను. అంతమాత్రంచేత నీ పెళ్ళి చేయలేననే అనుకున్నావా"?

"అదికాదు నాన్నా"

"చేతకాని తండ్రికి చెప్పుదెబ్బ కొట్టి చూపించావు."

"అది నా వుద్దేశం కాదు నాన్నా." సుభద్ర యేమేమో చెప్పాలనుకుంటోంది.

"నువ్వెళ్ళి అతన్ని వెదకరా. మనం వెళ్ళి అతని కాళ్ళూ, కడుపూ పట్టు కుందాం." జోగారావు కృష్ణమూర్తితో అన్నాడు.

"వాడెక్కడ దొరుకుతాడు నాన్నా. వాడెవడో లోఫర్ అయ్యుంటాడు''.

"అతనలా చేయడు. రామారావు చాలా మంచివాడు." సుభద్ర తలొంచు కునే అంది.

* * *

వన్యమృగాలు యెక్కువగానూ, సాధు జంతువులు తక్కువగానూ తిరుగుతున్న లోకం యిది. మంచివాళ్ళు వేళ్ళమీదా, ద్రోహులు వేలమీదా వున్న సమాజం యిది. అందుకే అన్యాయాలూ, మోసాలు యెక్కువ. ఆ కారణాన్నే కన్నీరు కాలువలుగా, గోదావరులుగా మారి పారుతూవుంటుంది, యీదేశంలో.

* * *

తలుపులు బద్దలుకొట్టేసరికి అంతా జరిగిపోయింది. సుభద్ర వళ్ళంతా కాలి స్పృహతప్పి వుంది. వళ్ళు వడిలిపోయి వుడికిన వంకాయలా కుత కుత లాడుతోంది. పాతికేళ్ళ అవివాహిత, కోరికలు తీరక, జీవచ్ఛవంలా మారి చాపమీద పరిచిన అరిటాకులో పడుకుని ఆరిపోయే దీపంలావుంది...చుట్టు పక్కల యిళ్ళ వాళ్ళు చేరారు. ఆరాలు తీస్తున్నారు. సానుభూతి చూపిస్తున్నారు. మనుషల్లా ప్రవర్తిస్తున్నారు. అప్పుడే జానకి అంటోంది.

"సమయానికి నేనూ యింట్లోలేను. వుంటే యిలా జరిగేది కాదు."

"గేస్‌పొయ్యిమీదనుంచి అన్నం దించుతోంది. చీర అంటుకుంది కంగారుతో పరిగెత్తిందట." కృష్ణమూర్తి చెబుతున్నాడు.

"పెళ్ళికూడా స్థిరపడిందమ్మా. మా కర్మ యిదంతా" లలితమ్మ చెబుతోంది. యింటి పరువు వీధిని పడకుండా కళ్ళు అప్పగించి చూస్తున్న సుభద్రకి-తను నిముషాలమీద చనిపోగల్గితే బావుండునని అన్పించింది. వళ్ళు కాలుతూండంగా యెవరైనా వచ్చి రక్షిస్తే చాలన్న ఆఖరి కోరికపుట్టింది. ఛీఛీ బ్రతుకుమీద తీపి యెలాంటి తప్పిదాల్ని చేయిస్తుంది.

చుట్టుపక్కలవాళ్ళు కొండంత సానుభూతి అందిస్తూంటే-వాళ్ళతో పాటు కృష్ణమూర్తీ, జానకి, లలితమ్మగారూ కూడా అంతకుమించి దుఃఖం వెళ్ళగక్కారు. గుండెలు పగిలేటట్టు యేడ్చారు.

